
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 7 జూలై 2025 | 5



కోట సత్తెమ్మకు ఆషాఢం సారె



నిడదవోలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైకలూరు మండలం కలిదిండికి చెందిన సుమారు 100 మంది భక్తులు అమ్మవారికి ఆషాఢ మాసం సారె, చీరలు సమర్పించారు. రాజవరం గ్రామానికి చెందిన గూడవల్లి మహాలక్ష్మి రూ.50 వేలు విరాళంగా అందజేశారు.ఆషాఢమాసం..ఆదివారం.. తొలి ఏకాదశి పర్వదినం కావడంతో భక్తజనం పోటెత్తారు. అమ్మను చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి కిటకిటలాడింది. అమ్మవారికి ఆదివారం మొత్తం రూ.2,14,011లు ఆదా యం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.ఈ మేరకు ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తొలి ఏకాదశి పూజలు

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహిం చారు.. వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి.. స్వామిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. గోవిందా..గోవింద అంటూ స్వామిని కొలుస్తూ భక్తపారవశ్యంలో మునిగిపోయారు. ఆషాఢమాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అని పిలుస్తారని.. ఆదివారం నుంచి నాలుగు నెలల పాటు విష్ణుమూర్తి పాల కడలి మీద నిద్రిస్తాడని అందుకే దీనిని శయన ఏకాదశి అని కూడా పిలుస్తారని భక్తులకు తెలిపారు.. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని వెంకటేశ్వరుడికి అర్చకులు పూజలు చేశారు.

8



ధాన్యం

సొమ్ములివ్వండి!

రబీ సొమ్ములకు ఎదురుచూపులు

గోకవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం సొమ్ములకు రైతులు ఇంకనూ ఎదురు చూస్తున్నారు. సొమ్ముల చెల్లింపులో జాప్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు ఖాతాలో జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం నెలలు గడుస్తున్నా స్పందించడం లేదని వాపోతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ధాన్యం కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు చాలా మంది రైతులకు పూర్తిగా సొమ్ము జమ చేయలేదు. గోకవరం మండలంలో రబీకి సంబంధించి సుమారు 2 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. రైతుల నుంచి సుమారు 11,536 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత జూన్ నెల నాటికి 130 మంది రైతులకు పైగా డబ్బులివ్వాల్సి ఉండగా కొంతమందికి మాత్రమే సొమ్ములు చెల్లింపులు జరిగాయి. ఇంకా సగానికి పైగా రైతులకు ధాన్యం సొమ్ములు జమ కావాల్సి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు నారుమళ్ళు సిద్ధం చేసుకుంటున్నారు.కొద్ది రోజుల్లో ఊడ్పులకు సిద్ధమవుతారు.ఈ నేపథ్యంలో రైతులకు పెట్టుబడులకు డబ్బులు కావాలి. ముందు రబీ పంటకు చేసిన రుణాలు తీరక కొత్త అప్పులు ఇచ్చేందుకు వడ్డీ వ్యాపారులు ముందుకు రాక అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు.రబీలో అమ్మిన ధాన్యానికి చెందిన డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తే ఆ డబ్బుతో చేసిన రుణాలు తీర్చడంతో పాటు, ఖరీఫ్ సాగుచేస్తామని రైతులు పేర్కొంటున్నారు. తాము అమ్మిన ధాన్యానికి డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారంటూ మండల వ్యవసాయ కేంద్రానికి వెళుతుంటే అక్కడ అధికారులు జాడ కనిపించడం లేదంటూ బాధిత రైతాంగం వాపోతుంది.కనీసం ఫోన్‌కు స్పందించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ఆషాఢం!



ఆఫర్ల వల.. డిస్కౌంట్ల మాయ

ఆషాఢంలో ఆకర్షణీయమైన ప్రకటనలతో జనాలను బురిడీ కొట్టించే మోళీ మొదలైపోతోంది. నిల్వ సరుకును అంటకట్టడం, నాసిరకంపై రెట్టింపు సొమ్ము లాగేయడానికి దుకాణాలకు ఓ మంచి అవకాశం చిక్కుతోంది. ఓ రూపాయి మిగులుతుందనే అమాయక జనం ఆశను ఆసరాగా చేసుకుని దగా చేయడం పరిపాటిగా మారిపోయింది. ఏకంగా 80 శాతం వరకూ రాయితీ ఇచ్చేస్తున్నారు. గతంలో ఈ మోసంలో కూడా కాస్త నిజాయితీ ఉండేది. రాను రాను మోసం పెరిగిపోయింది.దీంతో ఆ వస్త్రాలు మరో ఆషాఢాన్ని చూడలేకపోతున్నాయి. అయినా 'ఆషాఢం డిస్కౌంట్' మాట చెవిన పడగానే.. జనం ఎగబడడంలో మాత్రం డిస్కౌంట్ ఉండడం లేదు.ఆషాఢం మార్కెట్ మాయపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ఆషాడం అంటే వస్త్ర దుకాణాలకు అసలు వ్యాపారం ఉండేది కాదు.. అటువంటిది ఒక్క ఐడియా వ్యాపారాన్నే మార్చేసింది.. జనాలను షాపుల చుట్టూ తిరిగేలా చేస్తుంది.. అదే డిస్కౌంట్..10 నుంచి 90 శాతం వరకూ డిస్కౌంట్ ఇచ్చేస్తున్నారు. జనం అలాగే ఎగబడి కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 వేలు పైనే వస్త్ర దుకాణాలు ఉంటాయి. వీటిలో అత్యధికంగా ఒక్క రాజమహేంద్రవరంలోనే ఉంటాయి.ఈ ఒక్క ఆషాఢంలోనే కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుందని యజమానులే చెబుతున్నారు.ఎందుకంటే ఆషాఢం తరువాత వచ్చేది శ్రావణమాసం కావడంతో ఇప్పటి నుంచే సన్నద్ధమైపోతారు. డిస్కౌంట్ చీరలు కొంటారు.

నాడు వ్యాపారం నిల్.. నేడు ఫుల్..

ఆషాఢమాసం వచ్చిందంటే 'ఆషాఢం డిస్కౌంట్ సేల్' అనే బోర్డులు దాదాపు అన్ని దుకాణాల వద్ద చూస్తుంటాం. ఆషాఢం డిస్కౌంట్లకు ఎదురు చూసేవాళ్లు లేకపోలేదు. వస్త్రాలు, చెప్పుల షాపుల వద్ద ఎక్కువగా రాయితీలు కనబడుతుంటాయి. వ్యాపారం ముసుగులో ఒకరికి మించి మరొకరు రాయితీలను ప్రకటిస్తుంటారు. ఆషాడంలో సాధారణంగా పెద్దగా వ్యాపారాలు సాగవు. దీంతో బేరాలు పెరగడానికి డిస్కౌంట్లు పెడుతుంటారు. కొన్నేళ్ల కిందట డిస్కౌంట్లు కాస్త సహేతుకంగా సాగేవి. వ్యాపారులు ఆషాడంలో పాత స్టాకును క్లియర్ చేసుకునేవారు. రాను రాను ఆషాడం సేల్స్ అంటే మోసానికి నిలువెత్తు నిదర్శనంగా మారిపోయింది. అసలు ధరలను ఇష్టానుసారం వేస్తూ తగ్గింపును భారీ గా చూపించి ప్లాట్‌ఫాం సరుకును పెద్ద దుకాణాల్లో సైతం అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి.

రాయితీలో కిటుకు

ఆషాడంలో క్లియరెన్స్ సేల్ కాస్తా డిస్కౌంట్ దమాకాగా మారిపోయింది. ఎవరైనా రూ.100కి కొని రూ.40కి విక్రయిస్తారా? కచ్చితంగా జరగదు. మరి ఈ డిస్కౌంట్ల మేళా ఏమిటి? అంటే అదో పెద్ద మోళీ. వినియోగదారులను దుకాణంలోకి రప్పించడమే లక్ష్యంగా డిస్కౌంటు బోర్డులు తగిలిస్తారు.లోపలకు వెళ్లాక డిస్కౌంటు ధరల వస్త్రాలు చూస్తే నీరసమొస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వస్త్రాలను చూస్తారు. వాటికి ఒక్క రూపాయి డిస్కౌంటు ఇవ్వరు. డిస్కౌంటు కోసం వెళ్లిన వాళ్లు ఏ డిస్కౌంటూ లేని దుస్తులను కొనక తప్పదు. ఇదే అదనుగా వీటి ధరలను విపరీతంగా బాదేస్తుంటారు.

అసలు ధర ఎంతబ్బా?

వస్త్రాలు, చెప్పులు, బూట్లు వంటి వాటి అసలు ధరలు చెప్పడం ఎవరి తరమూ కాదు. వ్యాపారులు ఎంతకు హోల్‌సేల్‌గా కొంటున్నారో.. వాటికి రవాణా తదితర ఖర్చులతో కలిపి ధర ఎంత నిర్ణయించాలో అనే సహేతుకత లేదు. దీనిపై ఎవరి నియంత్రణా లేదు. ధరల నిర్ణయం, తనిఖీల్లో ప్రభుత్వ యంత్రాంగం పాత్రా అంతంత మాత్రమే. దీంతో ధరలను ఇష్టానుసారం వేస్తుంటారు. ఉదాహరణకు ఒక చీర ధర రూ.5 వేలు చూపించి 60 శాతం డిస్కౌంట్ అంటూ రూ.3 వేలు మినహాయిస్తారు. రూ.2 వేలకే రూ.5 వేల విలువ చేసే చీర అంటే జనం ఎగబడతారు. వాస్తవానికి ఎంఆర్పీ అంటే గరిష్ఠ చిల్లర ధర. వ్యాపారులు దీనిని చూపించి తగ్గించడం కుదరదంటూ బురిడీ కొట్టిస్తారు. ఎంఆర్పీపై కూడా తగ్గింపు ఇస్తున్నామంటూ దయ చూపించేస్తారు. వాస్తవానికి ఆ స్టిక్కర్లన్నీ వాళ్ల అంటించినవే కదా!. పైగా ఎంఆర్పీపై బేరమాడే వెసులుబాటు కచ్చితంగా వినియోగదారుడికి ఉందనే విషయం ఎంత మందికి తెలుసు?.

నకిలీ..మకిలీ!

ఆషాఢం సేల్స్‌లో భాగంగా బ్రాండ్ల పేరుతో బురిడీ కొట్టిస్తు న్నారు. ప్రముఖ కంపెనీ వస్త్రాలు, బ్యాగులు, బూట్లు, చెప్పు లు, హ్యాండ్ బ్యాగులు, డోర్ మ్యాట్‌లు అంటూ జనాలను మోసగి స్తున్నారు. ప్రముఖ బ్రాండ్లకు పోలిన నకిలీలను రాశులుగా పోస్తున్నారు. వాటిపై విపరీతమైన రేట్లు వేస్తున్నారు. ఓ ప్రముఖ కంపెనీ యాంబ్లమ్(చిహ్నం)తో ఉండే టాప్‌లు, హ్యాండ్‌బ్యాగ్, షూ వంటి వాటిపై వేలల్లో ఎంఆర్పీ పెడుతు న్నారు. ఏకంగా 70 శాతం డిస్కౌంట్ ధరకే ఇస్తున్నామని మోసగిస్తుస్తున్నారు. ఉదాహ రణకు ఒక బ్రాండెడ్ షూ ధర రూ.10 వేలు ఎంఆర్పీ చూపించి 70శాతం డిస్కౌంట్ అంటున్నారు. అంటే రూ.3 వేలకే బ్రాండెడ్ షూ వస్తుందని వినియోగదారుడు ఆశ పడుతున్నా డు. కానీ అది నకిలీ అని తెలుసుకోలేక పోతున్నారు. వాస్తవానికి ఆ షూ ధర రూ.500 కూడా ఉండకపోవచ్చు. అతి చిన్న తేడాలతో అసలైన బ్రాండుకు అతి దగ్గరగా యాంబ్లమ్‌లను ప్రింట్ చేస్తుండడంతో వినియోగ దారులు మోసపోతున్నారు.

- రండి బాబూ రండి.. మోసపోండి
- ఆకర్షణీయమైన ప్రకటనలతో బురిడీ
- నాసిరకం.. ప్రముఖ బ్రాండ్లకీ నకిలీ
- జనం ఆశతో కోట్లలో వ్యాపారం

ఆధ్యాత్మికతకు.. 'నెల'వై!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

హిందూ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచేది ఆషాఢం..తెలుగు సంవత్సరంలో నాలుగో నెల. శూన్యమాసమైనా.. శుభకార్యాలు తలపెట్టకపోయినా.. పూజా కార్యక్రమాలకు, దేవతారాధనకు ఇది అనువైన సమయం. అందుకే ఈ మాసంలో అమ్మవార్ల జాతరలు జరుగుతాయి. కొత్త అల్లుళ్లలకు ఆషాఢ పట్టీ వినోదాలు, మార్కెట్లలో ఆఫర్లు, తక్కువ ధరలతో వస్త్రాలు, వస్తువుల డిస్కౌంట్ సేల్.. ఇలా చెప్పుకొంటూ పోతే.. ఎన్నో విశేషాలు, వింతలకు ఈ మాసం నిలయం.ఈ మాసంలో పుడమి పులకించడంతో ఎక్కడ చూసినా ఆహ్లాదకరమైన హరిత వాతావరణమే కనిపిస్తుంది. దుమ్ము ధూళితో దర్శనమిచ్చే తరువులన్నీ తలంటు పోసుకున్నట్టుగా నిగనిగలాడుతుంటాయి. వ్యవసాయ పనుల ప్రారంభానికి అనువైన మాసం కావడంతో ఇంట్లో వారందరూ కష్టపడి పనిచేసేందుకు ముందుకు వెళ్లాల్సిన సమయం. ఆషాఢంలో వివాహాలు, గృహ ప్రవేశాలు చేయరు. ఇంటి నిర్మాణాలు చేపడితే ఆ ఇంటికి ధనధాన్యాలు, పశుసంపద, రత్నమాణిక్యాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసాన్ని శుచి మాసం అని కూడా అంటారు. ఇంట్లోని కంచు, ఇత్తడి వంటి వస్తువులను శుభ్రపరచుకోవడం, బంగారం, వెండి వస్తువులను మెరుగుపెట్టించుకోవడం చేస్తుంటారు. ఈ నెల రోజులు గ్రామ దేవతల పేరుతో వెలసిన అమ్మవారికి పూజలు చేసి భక్తిభావంతో కొలుస్తారు. వారాహి గుప్త నవరాత్రులు ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. ఆషాఢ శుద్ధ తొలిఏకాదశి, ఆషాఢ పూర్ణిమ, ఆషాఢ బహుళ సప్తమి, ఆషాఢ బహుళ ఏకాదశి పర్వదినాలు ప్రత్యేకమైనవి. ఈ సమయంలోనే కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మరిడమ్మ, తలుపులమ్మ లోవ, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయాల్లో భక్తుల సందడి ఉంటుంది. ఆషాఢంలో మునగాకును తప్పనిసరిగా తింటారు. మునగాకు కలిపిన కూరలు తినడంవల్ల ఒంటికి వేడి చేసి వర్షాకాలంలో ఒంటిని సమశీతోష్ణ స్థితిలో ఉంచుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

సాయి ఆలయానికి రూ. కోటి విలువైన ఇల్లు

వీలునామా రాసి మరణించిన న్యాయవాది విజయశ్రీ

కొవ్వూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆ దంపతులు సాయిబాబా భక్తులు.. అందుకే వారింటికి కూడా సాయి కుటీరం అనే పేరు పెట్టుకున్నారు..చివరికి ఆ ఇల్లు సాయి బాబా ఆలయానికే చెందాలని తలంచారు. అలాగే వీలునామా రాశారు. ఆ దంపతుల బంధువులు ఆదివారం ఆ వీలునామా సాయిబాబా ఆల యానికి ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన న్యాయవాదులు పడాల భానుప్రసాద్, గంధం విజయశ్రీ దంపతులు. విజయశ్రీ కొవ్వూరు బార్ అసోసియేషన్‌లో ప్రథమ మహిళా న్యాయవాదిగా 1974లో నమోదయ్యారు. అనంతరం ఏపీపీగా బాధ్యతలు నిర్వహించారు. భానుప్రసాద్ ఏడేళ్ల కిందట మరణించగా.. 2025 జూన్ 22వ తేదీన విజయశ్రీ మరణించారు.ఆమె చనిపోవడానికి ముందే 256 గజాల్లో కట్టుకున్న సుమారు రూ.కోటి విలువ చేసే తమ ఇంటిని కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని సాయి బాబా ఆలయానికి వీలునామా రాసి న్యాయవాది దొండపాటి కృష్ణారావుకు అందజేశారు.



వీలునామాను సాయి ఆలయానికి అందజేస్తున్న విజయశ్రీ కుటుంబీకులు

ఇంటికి సంబంధించిన పత్రాలను ఆదివారం న్యాయవాది కృష్ణారావు,విజయశ్రీ కుటుంబీకులు, భక్తులు, పెద్దల సమక్షంలో షిరిడి సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం ట్రస్ట్ సభ్యుడు గుడివాక శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు వర్రే నాగమురళీ కృష్ణ, న్యాయవాదులు నరుకుల హనుమంత రావు, బాలదారి రమేష్, వీరంశెట్టి రాజా వర ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్, ట్రస్టు సభ్యులు కసిరెడ్డి సీతారామయ్య, సిహెచ్.సుబ్బారావు,బి.సురేష్, ఎ.రాం బాబు,సిహెచ్.గణేష్ పాల్గొన్నారు.

పేపరుమిల్లు కార్మికుల సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వేతన ఒప్పందం విషయంలో మిల్లు యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. పేపరుమిల్లులో కార్మికులు పనులు నిలుపుదల చేసి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఇందులో 11 కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయి. కలెక్టర్ సమక్షంలో వేతన ఒప్పందం అమలు చేస్తామని అంగీకరించిన యాజమాన్యం దానిని అమలుచేయకపోవడాన్ని నిరశిస్తూ సమ్మె చేపట్టాయి. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో మిల్లులో కార్యకలాపాలు స్తంభించాయి. పేపరుమిల్లు కార్మికుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ పేపరుమిల్లులో 2020 జూలై 1 నుంచి 2023 వరకు వేతన ఒప్పందాన్ని యాజమాన్యం అమలు చేయలేదన్నారు. 12/3 అగ్రిమెంట్ ప్రకారం కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 58 నుంచి 60 ఏళ్లకు పెంచాలని చేసిన అగ్రిమెంట్‌ను అమలు చేయకుండా 58 ఏళ్లకే రిటైర్డ్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

బడికి.. వెళదాం!



- రండి..రండి దయ చేయండి
- 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్
- కూటమి ప్రభుత్వంలో రెండోసారి

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

పాఠశాలలు, కళాశాలలు ముస్తాబవుతున్నాయి.. పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు సన్నద్ధమవుతున్నాయి.కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమావేశాలు నిర్వహించడం రెండోసారి. ఆ రోజున అమ్మపేరుతో మొక్కలు నాటడం, ఫొటో బూత్ వద్ద తల్లిదండ్రులతో ఫొటోలు దిగడం, ఆటలపోటీలు, సహపంక్తి భోజనాలు ఇలా పండుగ వాతావరణంలో సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిసారి గతేడాది డిసెంబరు నెలలో నిర్వహించిన మెగా పీటీఎం విజయవంతం కావడంతో ఈసారి మెగా పీటీఎం-2.0 నిర్వహిస్తున్నారు.

అందరి భాగస్వామ్యంతో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పాఠశాలలు, కళాశాలల పనితీరు, విద్యాబోధనలో పలు మార్పులు తెచ్చారు. వీటిని తల్లిదండ్రులకు వివరించడం, పాఠశాలల అభివృద్ధిలో వారితో పాటు పూర్వ విద్యార్థులు, విద్యారంగ ప్రముఖులు, దాతలను భాగస్వాములు చేయడం లక్ష్యంగా దేశంలోని విద్యారంగ చరిత్రలో తొలిసారి గతేడాది డిసెంబరు 7న నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సత్ఫలితాలను ఇచ్చింది. రెండో విడత ఈనెల 10న ఈ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-2.0(మెగా పీటీఎం) నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంపై ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్లు అన్ని జిల్లాల అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు ఇచ్చారు.సమావేశం ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై రాష్ట్రస్థాయి నుంచే మినిట్ టూ మినిట్ ప్రోగ్రామ్‌ను పంపించారు.

ఫొటో సెషన్, ఆటల పోటీలు

10న ఉదయం 9గంటలకు సమావేశాలు ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిస్తారు. ఉదయం తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులను పాఠశాలకు ఆహ్వానిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసే ఓపెన్‌హౌస్ ఫొటోబూత్ వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఫొటో దిగే ఏర్పాటు చేయనున్నారు. అనంతరం తమ పిల్లలతో కలిసి వారి క్లాస్‌రూమ్‌లో తల్లిదండ్రులు కూర్చునేలా, ఇతర ప్రముఖులు హెచ్‌ఎం రూమ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో సంబంధిత క్లాస్ టీచర్ ప్రత్యేకంగా సమావేశమై వారి పిల్లల సమగ్ర పురోగతి కార్డులు(ప్రోగ్రస్ కార్డు), హెల్త్ కార్డును అందిస్తారు. అదే సమయంలో వీడియోల ద్వారా తల్లికి వందనం పథకం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్, మన బడి మేగజైన్ తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల తల్లులకు రంగోళి లేదా లెమన్ అండ్ స్పూన్ లేదా మ్యూజికల్ చైర్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. 11గంటలకు సమావేశాలు ప్రారంభించి మా తెలుగు తల్లికి పాట అనంతరం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్దేశించారు.ఇందులో భాగంగా విద్యార్థులతో వారి తల్లులకు పుష్పాలు సమర్పించి పాదాలకు నమస్కరించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా తల్లి పేరుతో మొక్క నాటడం, గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. నో టూ డ్రగ్స్, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యులవుతామంటూ సామూహిక ప్రతిజ్ఞ ఉం టుంది. చివరగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, ఆహ్వానితులు కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని చేస్తారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కామన్ లంచ్ ఏర్పాటు చేయాలి.

1677 పాఠశాలల్లో పేరెంట్స్ మీట్

ప్రశాంతి, కలెక్టర్, తూర్పుగోదావరి

ఈ నెల 10న జిల్లాలో 1537 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 120 కళాశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నాం. విద్యా నాణ్యతను మెరుగుపర్చేందుకు సమగ్ర శిక్షా మిషన్ కింద ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రతి పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులు అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా సేకరించేందుకు సమగ్ర ప్రశ్నావళి, రూపొందించి దాని కనుగుణంగా అభిప్రాయ సేకరణ చేయడం ప్రధాన లక్ష్యం. పేరెంట్స్ మీటింగ్‌కు పాఠశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

జంతువుల నుంచి రేబిస్

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రేబిస్ అనేది జంతువుల నుంచి ప్రధానంగా కుక్కల నుంచి వ్యాపించే ప్రాణాంతక వ్యాధి అని, ముందస్తు వ్యాక్సిన్ ద్వారా దీన్ని పూర్తిగా నివారించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం జంతువుల కాట్లపై అవగాహన-రేబిస్ వ్యాధి నివారణకు ముందస్తు వ్యాక్సినేషన్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడారు. జంతువుల కాట్లను తేలిగ్గా తీసుకోవద్దని, రేబీస్ వ్యాధిని అరికట్టేందుకు ముందస్తు వ్యాక్సినేషన్ తీసుకోవడం అతిముఖ్యమైన రక్షణ చర్య అని అన్నారు. జూలై 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ రేబిస్ వ్యాధి నివారణ కోసం ముందస్తు వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీ స్థాయిల్లో ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. జిల్లా ఎపిడెమియాలజిస్ట్ సుధీర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ జగదీష్, ఎంపీహెచ్‌ఈవో బుర్రే రాజు, వైఎస్ఎన్ మూర్తి, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఓ మై డాగ్!



ఇంటి కుక్కలు బయటకొచ్చాయి.. కాసేపు కనుల విందు చేశాయి..వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరం పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేశారు.. పలువురు జంతువులతో క్యూకట్టారు.

7

గోదావరి వరద తగ్గుముఖం



నిన్నటి వరకూ పెరిగిన గోదావరి వరద శాంతించింది.. ఆదివారం తగ్గుముఖం పట్టింది.

భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి

తొలి ఏకాదశి పర్వదినాన
రూ.60 లక్షల ఆదాయం


సత్యదేవుడి దర్శనానికి బారులుతీరిన భక్తులు

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవుదినం ఏకాదశి పర్వదినంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఉదయం 5గంటలనుంచి వ్రతాలు ప్రారంభించారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 2గంటలు, ఉచిత దర్శనానికి 3 గంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచిఉన్నారు. వ్రతమండపాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఇ టీవల వివాహాలు చేసుకున్న జంటలకు తొలిపండుగగా భావించే తొలిఏకాదశి రోజున స్వామిని దర్శించుకున్నారు. సుమారు 4వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.60 లక్షల ఆదా యం సమకూరింది. భక్తులకు ఎటువంటి అసౌ కర్యం కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రముఖుల పూజలు

సత్యదేవుడిని ఆదివారం దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, బీసీ సంక్షేమశాఖ ప్రిన్స్‌పాల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


సత్యదేవుడి ప్రసాదం కోసం క్యూలో ఉన్న భక్తులు

1.20 లక్షల ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

సత్యదేవుడి సన్నిధిలో అమృతతుల్యంగా భావి ంచే స్వామివారి గోధుమ రవ్వ ప్రసాదం అమ్మ కాలు ఆదివారం ఒక్కరోజే రూ.1.20 లక్షల ప్యాకెట్ల విక్రయాలు జరిగనట్టు ప్రసాదం విభాగ అధికారి పోల్నాటి లక్ష్మీనారాయణ తెలిపారు. తొలిఏకాదశి సందర్భంగా రత్నగిరికి విచ్చేసిన భ క్తులతో పాటుగా తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాల కు వెళ్లే భక్తులు జాతీయ రహదారిపై 2 నమూనాలయాలు, తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్లలో కలిపి ఈ అమ్మకాలు జరగగా ఒక్క ప్రసాదాల విక్రయాల ద్వారా సుమారు రూ.24 లక్షల ఆదాయం సమకూరింది.

సత్యదేవుడి దేవేరికి
వజ్రాల నక్లెస్ బహూకరణ


వజ్రాల నక్లెస్

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దేవేరి అనంతలక్ష్మి సత్యవతీదేవికి ఆదివారం రూ.19 లక్షల విలువైన వజ్రాల నక్లెస్‌ను బహూకరించారు. పెద్దాపురం లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్లలో ఒకరైన మట్టే ఆది శంకర్, స్రవంతి దంపతులు వీటిని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. ముందుగా ఆభరణం సంప్రోక్షణ చేసి అమ్మవారికి అలంకరించారు. దాతలను ఈవో అభినందించి స్వామివారి దర్శనం, వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరక్టర్లలో ఒకరైన మట్టే సత్యప్రసాద్ సూర్యకమల దంపతులున్నారు. ఈ ఆభరణం నిత్యఅలంకరణ చేపట్టాలని దాత కోరారు.


ఆలయ ఈవో సుబ్బారావుకు వజ్రాల నక్లెస్ అందజేస్తున్న దాత

ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు

రత్నగిరిపై వచ్చే నెలలో పనులు ప్రారంభించే అవకాశం : టూరిజం అధికారులు


అన్నవరం దేవస్థానం అధికారులతో కలసి స్థల పరిశీలన చేస్తున్న టూరిజం అధికారులు

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు పడింది. గతేడాది నిధులు మంజూరై వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు పనులు ప్రారంభంకాలేదు. దీనికి సంబంధించి టెండర్లు పిలిచి ఖరారుచేయగా సింహాచలం చందనోత్సవం సమయంలో గోడకూలి పలువురు మరణించడం, గోడకట్టిన నిర్మాణ కాంట్రాక్టర్ అన్నవరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒక్కరే కావడంతో ఆ సంస్థను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో మరోమారు టెండర్లును పిలిచారు. అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, అధునాతన టాయిలెట్ల నిర్మాణాలకు కలిపి సుమారు రూ.18.98 కోట్లతో టెండర్లు పిలవగా వాటిని తెరిచినా సాంకేతిక కారణాలతో వాటిని ఫైనల్ చేయలేదు. అయితే ఈ వారంలో టెండర్లు ఫైనల్ అవుతాయని, వచ్చే నెలలో పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్టు టూరిజం అధికారులు తెలిపారు. ఆదివారం టూరిజం శాఖ ఎస్ఈ ఈశ్వరయ్య, డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేష్ ప్రసాద్‌స్కీం ద్వారా నిర్మించబోయే నిర్మాణాల స్థలాన్ని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈవో సుబ్బారావును కలసి టెండర్ల ఖరారుపై చర్చించారు. ఈ నిర్మాణాల్లో దేవస్థానం కేవలం పర్యవేక్షణ మాత్రమే చేయనుంది. నిధులు, కాంట్రాక్ట్ ఇతర పనులు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

తెలుగు టీచర్ ఔదార్యం

హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం


ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం

సర్పవరం జంక్షన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అన్నపూర్ణాదేవిగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ చరిత్రను భావితరాల విద్యార్థులకు చా టి చెప్పేలా తెలుగు ఉపాధ్యాయురాలు సీతమ్మ విగ్రహం తయారు చేయించారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు ముత్య వెంకటలక్ష్మి. ఆమె చేస్తున్న విద్యాబోధన, ఇతర సేవా కార్యక్రమాలకు ఉత్తమ ఉపా ధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. డొక్కా సీతమ్మ విగ్రహాన్ని హైస్కూల్ ప్లస్‌లో ఏర్పాటు చేయాలని భావించి విద్యాశాఖ అధికారుల అనుమతి తీసుకున్నారు. సుమారు రూ.78 వేలు వెచ్చించి కొత్తపేటకు చెందిన ప్రముఖ విగ్రహ శిల్పి రాజ్‌కుమార్ వడియార్‌తో విగ్రహాన్ని తయారుచేయించి హైస్కూల్‌కి తరలించారు. విగ్రహాన్ని సోమవారం డీఈవో రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీతో కలసి విద్యాశాఖ అధికారులు ప్రారంభోత్సవం చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు స్ఫూర్తితో డొక్కా సీతమ్మ చరిత్ర విద్యార్థులకు తెలపాలని విగ్రహాన్ని తయారు చేయించినట్టు రామలక్ష్మి తెలిపారు.


విగ్రహాన్ని తయారుచేయించిన ముత్య వెంకట రామలక్ష్మి

వెయ్యి కిలోల పశుమాంసం స్వాధీనం

నలుగురిపై కేసు

గొల్లప్రోలు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులోని అనధికారిక పశు కబేళాపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడులు చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న వెయ్యి కిలోల పశుమాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా పశువులను వధించిన ఆరుగుల తాతయ్య, గుడివాడ గున్నయ్య, వాసా జగదీష్, మిరియాల రమేష్‌పై కేసు నమోదు చేసి 4 మోటారు సైకిళ్లు, మినీ ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. పశుమాంసాన్ని పూడ్చి కేసు దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌లో జరిగిన హత్యాయత్నం సంఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. బైపాస్‌రోడ్డులో తాటిపర్తికి వెళ్లే రహదారి సమీపంలో జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసి అనిశెట్టి వంశీ అనే వ్యక్తిని జ్యోతుల రాము, ఊటా ఇంద్ర కత్తితో పొడిచిన సంగతి తెలిసిందే. దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. అరెస్టు చేసిన ఇద్దరిపై చత్తీస్‌ఘడ్‌లో గంజాయి కేసులు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో 18 మందికి గాయాలు

కాట్రేనికోన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో శనివారం రాత్రి పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. 18 మందిని కరిచింది. బాధితులు కాట్రేనికోన పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స పొందారు. మెరుగైన చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించినట్టు వైద్యాధికారి జి నీలిమ తెలిపారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు కాకినాడలో చికిత్స తీసుకుంటున్నారు.

కత్తిపూడిలో చోరీ

శంఖవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన రౌతు శివ ఇంట్లో ఆదివారం తెల్లవారు జామున దొంగలు చొరబడి 50 తులాల వెండి, రూ.10వేలనగదు, టీవీ అపహరించుకుని పోయారు. గత శుక్రవారం బాధితుడి నానమ్మ చనిపోగా క్రతువుల కోసం మూడు రోజులుగా సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన సంఘటన తుని రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. సుమారు 50 ఏళ్ల కలిగిన వ్యక్తిని నర్సీపట్నం రోడ్డు సమీపంలో రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. సంబంధీకులు 94906 19020లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్

- కాకినాడలో రెండు సహాయకేంద్రాల ఏర్పాటు
- ఇంజనీరింగ్ కోర్సుల షెడ్యూల్ విడుదల
- 7 నుంచి 16 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు

జేఎన్టీయూకే, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్-2025 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. దీనికి సంబంధించిన మొదటి పేజ్ నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ జారీచేశారు. 7నుంచి 16 వరకూ ఏ ర్యాంకువచ్చినా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కోవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 26 ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు మొత్తం 16,660 సీట్లుండగా అక్కా, జేఎన్టీయూకేలోని 2ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో 520 సీట్ల వరకూ ఉండగా, 24 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 16,140 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ జిల్లా పరిధిలో 6,343, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 2868, తూ ర్పుగోదావరి జిల్లా పరిధిలో 6011మంది విద్యార్థులు ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించారు.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపు, రిజిస్ట్రేషన్: ఈనెల 7నుంచి 16 వరకూ
- ధ్రువపత్రాల పరిశీలన: ఆన్‌లైన్‌లో ఈనెల 7 నంచి 17వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు: ఈనెల 13నుంచి 18వరకూ.
- ఆప్షన్ల మార్పు: ఈనెల 19.
- సీట్ల కేటాయింపు: జూలై 22
- కళాశాలల్లో రిపోర్టింగ్: ఈనెల 23నుంచి 26 వరకూ
- తరగతులు ప్రారంభం: ఆగస్టు 4 నుంచి

సందేహాలుంటే...

అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాధపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల, కాకినాడ జేఎన్టీయూకేలో ఏర్పాటు చేసిన సహాయకేంద్రంలలో సంప్రదించాలి.

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలు

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా

అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్‌టికెట్, పుట్టినతేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించి అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ కొట్టాలి.

రజకుల సమస్యలు కేంద్రం దృష్టికి తీసుకెళ్తా

- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ
- రాజమహేంద్రవరంలో రజకుల ఆకాంక్ష సభ


శ్రీనివాస వర్మకు వినతిపత్రం అందజేస్తున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రజకుల అవసరాలను, వారి సమస్యలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, వారిని ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర సామాజిక, న్యాయశాఖామంత్రితో రజక సంఘ ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రజకుల ఆకాంక్ష సభ నిర్వహించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేశారు. కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రజకుల అభ్యున్నతికి వారికి అవసరమైన డిమాండ్లకు తన మద్దతు ఉంటుందన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రజకుల సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రజకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ బీసీ కుల వృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు రాజ్యాంగపరమైన చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ రజకులకు మేలు చేకూర్చే జీవో 27ను అమలుపై రాష్ట్ర మంత్రులకు విన్నవించగా సానుకూల స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ రంగంలోని దోబీ పోస్టులు, కాంట్రాక్టులను రజకులకు కేటాయించేలా ప్రత్యేక జీవో తీసుకురావాలని కోరుతున్నామని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రజకసేవా సంఘం నాయకులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు, రజకులు పాల్గొన్నారు.



సభలో మంత్రి దుర్గేష్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

ఎస్ఐ కుటుంబానికి రూ.25 లక్షల సాయం


ఎస్ఐ అశోక్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఎస్ఐలు

నరసాపురం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణలోని కోదాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ అశోక్ కుటుంబానికి 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు రూ.25లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆంధ్ర, తెలంగాణలో వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఈ బ్యాచ్‌కు చెందిన 1140మంది సీఐలు, ఎస్ఐలు ఈ మొత్తాన్ని సేకరించారు. ఆదివారం ఎస్ఐ సొంత ఊరు నరసాపురంలో జరిగిన అశోక్ సంతాప కార్యక్రమానికి హాజరై ఎస్ఐ కుటుంబానికి అందించారు. పిల్లల చదువులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే ఈ ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ బైసన్ జీవన్‌కు రూ.5 లక్షల సాయం చేశారు.

తగ్గుముఖం పడుతోన్న గోదావరి ఉధృతి

2,18,257 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద ఆదివారం ఉదయానికి 10.90 అడుగుల నీటి మట్టం ఉండగా 2.11లక్షల క్యూసెక్కులు బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు ప్రవహించింది. సాయంత్రానికి నీటి విడుదలను మరింత పెంచి ధవళేశ్వరం ఆర్మ్‌లో 50గేట్లను 40మీటర్లు, 20గేట్లను 80 మీటర్లు, ర్యాలి ఆర్మ్‌లో 43గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 20 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 39 గేట్లను 40మీటర్ల మేర పైకి ఎత్తి 2,18,257క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో బ్యారేజ్ దిగువ భాగం జలకళ సంతరించుకుంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.10 అడుగులుగా నమోదైంది. భద్రాచలం వద్ద 20.30 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ 18.50 అడుగులకు చేరుకుంది.

టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో నవజాత శిశువు మృతి

బంధువుల ఆందోళన


మృతిచెందిన నవజాత శిశువు

ఐ.పోలవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో ఆదివారం నవజాత శిశువు మరణించడంతో బాధిత కుటుంబం, బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే పుట్టిన బిడ్డ మరణించాడంటూ నినాదాలు చేశారు. ఐ.పోలవరం పంచాయతీ పెదమడికి చెందిన ధరణి కేశనకుర్రు పీహెచ్‌సీలో ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. ఆమె ప్రసవం కోసం టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో చేరింది. ఆదివారం ఆమెకు శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. పుట్టిన మగబిడ్డ కొద్ది సేపటికి మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందినట్టు ఆరోపిస్తూ బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఎస్ఐ రవీంద్రబాబు ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు. దీనిపై సూపరింటెండెంట్ దయానాను వివరణ కోరగా వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. అయితే టి.కొత్తపల్లి ఆసుపత్రిలో తరచూ జరుగుతున్న ఇటువంటి సంఘటనలపై శాఖాపరమైన దర్యాప్తు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.


పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

13న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్ల ఎంపిక, ఒకరోజు ఉమ్మడి జిల్లా చాంపియన్‌షిప్ పోటీలు రాజమహేంద్రవరంలోని వీకేవీటీ కళాశాలలో ఈనెల 13వ జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. 2007 జనవరి 1 తర్వాత పుట్టిన వారే ఇందులో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. పాల్గొనదలచిన వారు ఒరిజినల్ ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలు తీసుకురావాలని కోరారు. ఇందులో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనవారు పిఠాపురంలో ఆగస్టు 14 నుంచి 17 వరకూ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కరెంటు బిల్లు.. గుండె ఝల్లు...


రూ.3,38,496 వచ్చిన బిల్లు

మలికిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మలికిపురంలో ఒక షాపింగ్ కాంప్లెక్సులో ఉన్న రెడీమేడ్ దుస్తుల షాపునకు జూలై నెల కరెంటు బిల్లు రూ.3,38,496 వచ్చింది. బిల్లును చూసి షాపులో అద్దెకు ఉంటున్న కె.యువకుమార్ ఆశ్చర్యానికి లోనయ్యాడు. వెంటనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపినట్టు తెలిసింది. గతంలో రూ.1500 నుంచి రూ.2వేల వరకు బిల్లు వచ్చేదని యువకుమార్ తెలిపాడు.

'లోవ'లో లక్ష తులసి పూజ

తుని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం అమ్మవారికి పండితులు లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు వేలాదిగా పోటెత్తారు. ఆలయానికి రూ.8.50లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.


తులసి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడలో అంతర్ జిల్లా ఈత పోటీలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న స్విమ్మర్ గోలి శ్యామల

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఈత కొలనులో 10వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీలు జరిగాయి. సుమారు 150 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ జాతీయ మార్థాన్ స్విమ్మర్ గోలి శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒకరు కూడా విద్యార్థి దశ నుంచే నడవడిక నేర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. మరో ముఖ్య అతిథిగా డీఎస్‌డీవో శ్రీనివాస్ కుమార్ హాజరయ్యారు. కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో గ్రూప్ బాయ్స్ విభాగం నుంచి కే.వీరశివకృష్ణ, ఎం.గోకుల కన్నా, కే ముత్యాల ముఖేష్, వి.మణికంఠ నవీన్, టి.దుర్గేష్.. గ్రూప్ వన్ గర్ల్స్ విభాగంలో పి.సహస్ర శ్రీ.. గ్రూప్ టుబాయ్స్ విభాగంలో టీవీసీ.సాయి సాకేత్, పి.కౌశిక్ వర్ధన్ మిచిల్ అర్జున్, ఏ.అభిసాయి, వై.గౌతమ్, ఏ అక్షిత, వీరాజ్ విజయ్ కాలే, వెనిస్టెంట్ చార్లెస్ స్టీఫెన్.. గ్రూప్ టూ గర్ల్స్ విభాగంలో సీహెచ్.హిమద్యోతి, కే.తనుశ్రీ.. గ్రూప్ త్రీ బాయ్స్ విభాగంలో కే.దర్శిల్, ఎస్.క్రితిక్, ఎం.షణ్ముఖీశ్వర్, ఏం.సాయిచరణ్, జి భువనేష్, జి.రోబిన్... గ్రూప్ త్రీ గర్ల్స్ విభాగంలో ఎస్ గుల్బర్, జి.అన్విధ, ఎం.పల్లవి, ఎం.ఆశస్విని ఎంపికయ్యారు. వారంతా ఈనెల 19, 20న విశాఖపట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పదోవ సబ్ జూనియర్ అంతర జిల్లాల ఈతల పోటీల్లో పాల్గొంటారు. స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమల్ల రాజు, ముఖ్య సలహాదారుడు మంగా వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కోచ్‌లు ఎం.అజయ్‌కుమార్, పీఏ నాయుడు, వి.వీరభద్రయ్య, ఎల్.రాకేష్, జి.మురళీకృష్ణ ఈత క్రీడాకారులను ఎంపిక చేశారు.

'జూనో'లో జాలీగా..

– రాజమహేంద్రవరం సిటీ

జూనోసిస్ డే సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పశువుల ఆసపత్రి వద్ద వివిధ రకాల జంతువులను వ్యాక్సిన్ కోసం తీసుకొచ్చారు. ఆ చిత్రాలే ఇవి.




రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

మధుర గాయకుడు మంగళంపల్లి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై6(ఆంధ్రజ్యోతి): సంగీత సరస్వతి ముద్దుబిడ్డ మంగళంపల్లి బాల మురళీకృష్ణ అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని శ్రీనివాస్ నగర్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పద్మవిభూషణ్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మంగళంపల్లి బాల్యంలోనే సప్తస్వరాలతో సంబంధం ఏర్పరచుకున్నారని, ఎనిమిదేళ్ల ప్రాయంలోనే విజయవాడలో కచేరీ నిర్వహించారని, ప్రసిద్ధ సేవాలయర్(ఫ్రాన్స్) అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. బాల మురళీకృష్ణ టీటీడీ, శృంగేరీ పీఠంకు ఆస్థాన సంగీత విద్వాంసుడిగా ఉన్నారని కీర్తించారు. అనంతరం విగ్రహశిల్పి రాజ్‌కుమార్ వడయార్ తదితరులను సత్కరించారు.కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కంటిపూడి రాజేంద్రప్రసాద్, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాస్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధ,రెడ్డి మణేశ్వరరావు, కోసూరి చండీప్రియ, కీర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

పేపరుమిల్లు రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీకే



పేపరుమిల్లు రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏపీ పేపరుమిల్లు రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా టీకే విశ్వేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక కృష్ణసాయి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఏపీ పేపరు మిల్లు రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్‌లో పాత కమిటీలను రద్దుచేసుకుని 2025-27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు. తొలుత.. మృతిచెందిన 11 మంది అసోసియేషన్ సభ్యులకు నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా సీహెచ్‌వీ రామరాజు, అధ్యక్షుడిగా టీకే విశ్వేశ్వరరెడ్డి, సెక్రటరీగా ఎస్‌వీవీ రెడ్డి, కోశాధికారిగా బి.అప్పారావు, ఉపాధ్యక్షులుగా పీబీఎస్ భాస్కర శర్మ, ఎం.భాస్కరరావు, జాయింట్ సెక్రటరీలుగా ఎంఆర్ఎల్ శర్మ, సీహెచ్ఎస్ వీరభద్రరావు, ఎ.శివ ప్రసాద్, మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా, ఇద్దరు సలహామండలి సభ్యులుగా ఎన్నికయ్యారని ఎస్‌వీవీ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా గతంలో అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేసి మృతిచెందిన ఎస్‌పీఎస్ దొర కుటుంబానికి రామరాజు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కూండ్రపు రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కుల్ని హరిస్తోందని ఆరోపించారు. దీన్ని కార్మికవర్గం ప్రతిఘటించాలన్నారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, ఎస్ఎస్ మూర్తి, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న జస్టిస్ జ్యోతిర్మయి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో కృషి ఉన్నత స్థాయికి ఎదగాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సూచించారు. ఆదివారం స్థానిక సాయికృష్ణ థియేటర్ వద్ద ట్రైనింగ్ కళాశాల ఆవరణలోని జీఎంపీ స్కూల్ పూర్వ విద్యార్థులు స్థాపించిన 1969 అలూమిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. ప్రతిభావంతులైన, పదో తరగతి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు న్యాయమూర్తి చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. సీహెచ్‌వీ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవత సుధాకర్, అల్లు దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఆర్ మూర్తి, ఎ.కోదండరావు, కేకే వెంకటేశ్వర్లు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటుకు భూమిపూజ

అనపర్తి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పేరా రామచంద్రపురం సర్పంచ్ తేతల సుధాకరరెడ్డి అన్నారు. గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఉన్నత పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటుకు దాత, టీడీపీ నాయకుడు ద్వారంపూడి తాతారెడ్డి రూ.2 లక్షల విరాళం అందజేశారు.దీంతో పాఠశాలలో బోర్‌వెల్ ఏర్పాటు పనులకు సర్పంచ్ సుధాకరరెడ్డి ఆదివారం భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. విరాళం అందజేసిన తాతారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కర్రి బులిరెడ్డి, ఉప సర్పంచ్ కర్రి శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం జయరామ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఇద్దరి ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన అండర్-13 జిల్లాస్థాయి చెస్ పోటీల్లో మంచి ప్రతిభ చూపించిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో శ్రీనికేష్ జమ్మలమడక ప్రథమ బహుమతి, బాలికల విభాగంలో సత్య తేజశ్రీ సుంకర ద్వితీయ బహుమతి గెల్చుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని కోచ్, క్యాల్యూజన్ చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ తెలిపారు. అలాగే అకాడమీ నుంచి వివిధ విభాగాల్లో చిన్నారులు బహుమతులు గెల్చుకున్నారని, అండర్-11 విభాగంలో వై.సుజయ్ ప్రథమ, అండర్-7 బాలుర విభాగంలో కేతన్‌సాయి శ్రియన్స్ ప్రథమ, లక్ష్మీ చైతన్య ద్వితీయ, బాలికల విభాగంలో తొట్ట పరిణిత ప్రథమ, అండర్-9 బాలికల విభాగంలో హంసిక ద్వితీయ బహుమతులు గెలుపొందారని ఆయన పేర్కొన్నారు.

కోనేరు మురళీకి ఎంపీ పరామర్శ



సుష్మంత్ వెంకట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): పుత్రవియోగంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నేత, నగర ప్రముఖుడు కోనేరు మురళీకృష్ణసాయి కుటుంబాన్ని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు పరామర్శించారు. ఆదివారం నగరంలోని మురళీ నివాసానికి వారు చేరుకుని సుష్మంత్ వెం కట్ చిత్రపటానికి నివాళులర్పించారు. మురళీని పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఎంపీ వెంట తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, టీడీపీ నాయకుడు నిమ్మలపూడి గోవింద్ ఉన్నారు.

'బోధనేతర పనుల భారం తగ్గించాలి'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై బోధనేతర పనులు భారం తగ్గించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జేడీఐజే డేనియల్‌బాబు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో ఆదివారం డీఎంహెచ్ స్కూల్లో జరిగిన ఎస్టీయూ జిల్లా కార్యవర్గ రెండో సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల అనవసర ఒత్తిడికి లోనై సతమతమౌతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలన్నారు.ఒక పక్క ఆర్థిక ప్రయోజనాలను తొక్కిపెట్టి ఉద్యోగులను ఈవిధంగా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. లోకల్, ఆప్షనల్ హాలీడేస్ విషయంలో కమిషనర్ స్థాయి అధికారి జోక్యం చేసుకోవడం బాధాకరమన్నారు.ఉపాధ్యాయుల బకాయిలను విడుదల చేయాలని, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. వివిధ మండలాల ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా..ఇంతేగా!



మునగాల రోడ్డులోని తోట కాలువ సమీపంలో కొట్టుకుపోయిన తూరలు

» సా..గుతున్న కోరుకొండ-ముగ్గళ్ల రహదారి విస్తరణ పనులు
» తోట కాలువ వరద ఉధృతికి కొట్టుకుపోతున్న డైవర్షన్ రోడ్డు
» ఇబ్బందులు ఎదుర్కొంటున్న 10 గ్రామాల ప్రజలు

కోరుకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): కోరుకొండ, ముగ్గళ్ల గ్రామాల మధ్య వైసీపీ హయాంలో మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. సుమారు 10కిలోమీటర్ల మేర రెండు మండలాలను కలిపే ఈ ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించడానికి పనులు చేపట్టారు. మార్గం మధ్యలో మునగాల తోట కాలువ సమీపంలోను, రాజు చెరువు సప్లై కాలువ వద్ద వంతెనలు నిర్మించాల్సి ఉంది. అందుకోసం రోడ్డు మధ్యన గండి కొట్టి ప్రయాణికులకు డ్రైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలో ఆపివేశారు. అప్పటి నుంచి ముగ్గళ్ల, కూనవరం, మునగాల, కాపవరం, కోరుకొండ గ్రామాల మీదుగా సీతానగరం వెళ్లే ప్రయాణికులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రతి నిత్యం అనేక మంది ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో గత ఏడాది తోట కాలువ వరద ఉధృతికి గండిపడి డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి కోరుకొండకు మార్గం లేదు. అలాగే కాపవరం, కోరుకొండ గ్రామస్థులు మునగాల, కూనవరం వెళ్లేందుకు మార్గం లేదు. దీంతో 3 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి శ్రీరంగపట్నం మీదుగా వెళ్లాల్సి వచ్చేది. గత ఏడాదంతా ప్రజలు ప్రయాణం చేసి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కాంట్రాక్టర్లతో మాట్లాడి తోట కాలువ వద్ద వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే గత డిసెంబర్‌లో ప్రారంభమైన ఈ పనులు నేటికి పూర్తి కాలేదు. దీంతో మరోసారి తోట కాలువ వరదకు డైవర్షన్‌లో వేసిన తూరలు కొట్టుకుపోయాయి. దీంతో కూనవరం, మునగాల గ్రామాలకు కష్టాలు మొదలయ్యాయి. శ్రీరంగపట్నం మీదుగా చుట్టూ తిరిగి కోరుకొండకు వస్తున్నారు. తక్షణం వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని పది గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



కోరుకొండ నరసింహస్వామి ఆలయం వద్ద దీపోత్సవం చేస్తున్న భక్తులు

» భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
» స్వామి, అమ్మవార్ల దర్శనానికి బారులు
» ప్రత్యేక పూజలు, అర్చనలు

కోరుకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.: చారిత్రాత్మక కోరుకొండ స్వయం భూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండపైన ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు,పారాయణాలు, భజనలు జరిగాయి. కోరుకొండ గిరి ప్రదక్షిణ బృందం ఆధ్వ ర్యంలో కొండ పొడవునా 650 మెట్లకు ఇరువైపులా దీపాలు వెలిగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు విష్ణు సహస్ర నామ, గోవిందనామ పారాయణం చేశారు. గ్రా మపెద్దలు, రైతులు అర్ధ ఏకాహ భజన చేశారు. అలాగే హరేరామ సమాజం వద్ద సాయంత్రం మహిళా బృందం విష్ణు సహస్ర నామ పారాయణ, హరేరామ నామ సంకీర్తన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమం తా దీపాలు వెలిగించారు. అలాగే కాపవరం, పశ్చిమగోనగూడెం, బూరుగుపూడి, శ్రీరంగపట్నం, నర్సాపురం, గాదరాడ, తదితర గ్రామాల్లో తొలి ఏకాదశి భజనలు, ఏకాహాలు నిర్వహించారు. గ్రామదేవతలకు పాయసాలు, కుడుములు, నైవేద్యాలు పెట్టి తొలి ఏకాదశిని తొలిపండగగా జరుపుకున్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో ప్రాచీన లక్ష్మీగణపతి, గోలింగేశ్వరస్వామి ఆలయాలు, బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. బిక్కవోలులోని పెదరావిచెట్టు సెంటర్‌లోని రామాలయంలో ఏకాహం నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకూ భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీత, రామ, లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



బిక్కవోలు రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

అనపర్తి: అనపర్తిలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయార్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే కెనాల్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద దర్శనానికి భక్తులు బారులు దీ రారు. పలు ఆల యాలను పూలదండలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వా మి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివాన్‌చెరువు: స్థానిక డీవీబీ రాజు లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి స్వామి, అమ్మవార్లకు తులసి దళాలతో పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ధవళేశ్వరం: గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గంటల తరబడి లైన్‌లో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి ఆలయా ర్చకులు వివిధ రకాల పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాం గణం భక్తుల నామ స్మరణతో మారుమ్రోగింది. దర్శనాంతరం భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు అందించారు. ఆలయ ఈవో నాగ సురేష్, కమిటీ చైర్మన్ నీలి కోటేశ్వరరావు పర్యవేక్షణలో సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు దిండి జగదీష్, ధారపు శివారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్, జనసేన నాయకుడు యడ్ల మహేష్ స్వామి వారి సేవలో పాల్గొన్నారు.

రంగంపేట: వడిశలేరు గ్రామంలో శ్రీభజేనారాయణస్వామి, అన్న పూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిని టీడీ పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు దర్శించుకున్నారు. ఆయన వెంట ఉండవిల్లి గిరిబాబు, మోదుకూరి గోపాల కృష్ణ, ఎం.శ్రీను, ఆనందరావు తదితరులున్నారు.



ధవళేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వేంకటేశ్వర స్వామి

వెండిఛత్రం బహూకరణ

ధవళేశ్వరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అయ్యల సత్యనారాయణ దంపతులు సుమారు రెండు కిలోల వెండి ఛత్రాన్ని చేయించి బహూకరించారు. పోతుల బిందుమాధవి వెండి సాలిగ్రామ మాల, మరో భక్తుడు సీహెచ్ ముత్యాలరావు వెండి నిత్యాభిషేకం శంఖం, పోతంశెట్టి సత్యనారాయణరెడ్డి దంపతులు ఇత్తడి సహస్ర ధారా పాత్రను అందజేశారు.

ముత్యాలమ్మకు సారె

రాజానగరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాజానగరం గ్రామ దేవత శ్రీముత్యాలమ్మకు తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ఆషాడం సారె సమర్పించారు. దీనిలో భాగంగా ఆలయంతో పాటు అమ్మవారిని పలు రకాల పండ్లు, కూరగాయలు, పుష్పాలతో అలంకరించారు. అలాగే భక్తులు ఒకరికి మించి మరొకరు పోటాపోటీగా స్వయంగా తయారు చేసిన దాదాపు 1500 కిలోలకు పైబడిన వివిధ రకాలైన స్వీట్లు, పసుపు కుంకుమలను అమ్మవారికి సారె రూపంలో సమర్పించారు. తొలుత అమ్మవారిని పల్లకిలో ఉంచి కలశాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, కోలాట ప్రదర్శనలతో గ్రామంలో ఊరేగించారు. ఆలయం వద్ద లలిత, విష్ణు సహస్ర నామ పారాయణాలు, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి ని ఆలపించారు. అలాగే మరో గ్రామ దేవత శ్రీనూకాలమ్మకు కూడా భక్తులు ఆషాడం సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాజానగరం ముత్యాలమ్మకు నివేదించిన పలు రకాల స్వీట్లు

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి



బాబూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

వర్ధంతి కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపప్రధాని దివంగత డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతిజ్ఞ కృషి చేయాలని దళిత ఐక్యవేదిక, ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, ధారా యేసురత్నం, చాపల చిన్నరాజు అన్నారు. జాంపేట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ సెంటర్‌లో ఆదివారం బాబూజీ వర్ధంతి కార్యక్రమం చిన్నరాజు ఆధ్వర్యంలో జరిగింది. దీనికి దళిత ఐక్య వేదిక నాయకులు, ఎస్సీ ఎస్టీ ఉద్యోగ నాయకులు హాజరై బాబూజీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఉప ప్రధానిగా, రక్షణ, కార్మిక శాఖ మంత్రిగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశానికి సేవలందించారన్నారు. దేశంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆయన పేరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో మామిడి శ్రీనివాస్, ఉడమాల నాగేశ్వరరావు, ఎంపీడీ కృపావరం, చెన్న వెంకటరమణ, కారింగి వీర్రాజు, మండపల్లి శేఖర్, రెల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక జాంపేట వంతెన వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటీ రామారావు, పట్నాల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అంటరానితనంపై పోరాడిన స్వాతంత్ర సమరయోధుల్లో బాబూజీ ఒకరని అన్నారు. భారత పార్లమెంటులో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా, ఉప ప్రధానిగా, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కిషోర్ జైన్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని ఎస్టీ రాజాపురంలో జరిగిన కార్యక్రమానికి మాదిగ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు గెడ్డం చిట్టిరాజు విచ్చేసి బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఉన్నతి కోసం బాబు జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 7న వడిశలేరులోని కమ్యూనిటీ హాల్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సం దర్భంగా రక్త, నేత్ర దాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వేమగిరిలో తొలి అడుగు

కడియం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి దిశగా కూటమి పాలన సాగుతోందని తెలుగు దేశం పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ తెలిపారు. వేమగిరిలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, వెలుగుబంటి నాని పాల్గొన్నారు.

యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌లో అజాగ్రత్త వద్దు



అనపర్తిలో యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్న సుధాకరరెడ్డి

తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ సుధాకరరెడ్డి

అనపర్తి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల ఆరోగ్య విషయంలో యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు వ్యాక్సినేషన్ చేయించాలని ముఖ్యంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ పట్ల అజాగ్రత్త వహించవద్దని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా అనపర్తి ప్రాంతీయ పశు వైద్యశాలలో యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్య శాఖ ఏడీ వై శ్రీనివాసరావు, పొలమూరు పశు వైద్యుడు టి.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100కు పైగా కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందించారు. కార్యక్రమంలో నాయకులు దత్తుడు శ్రీను, తమలంపూడి సత్తిరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడియం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ కడియం ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో రేబిస్ వ్యాధికి ఉచిత టీకాల కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్(నాని), వెటర్నరీ డాక్టర్ రవి పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో పెంపుడు జంతువుల సందడి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పెంపుడు జంతువులు సందడి చేశాయి. వరల్డ్ జూనోసిస్‌డే సందర్భంగా ఆదివారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద పెంపుడు జంతువులకు టీకాలు, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పామేరియన్, లేబ్రడార్, గోల్డెన్ రిట్రైవర్, డాబర్‌మ్యాన్, హస్కి, జర్మన్ షెపర్డ్, సిజ్జు, పగ్, డ్యాస్ వంటి పెంపుడు కుక్కలు, పప్పీలు, వివిధ రకాల పిల్లులతో పశువుల ఆసుపత్రి ప్రాంగణం సందడిగా మారింది. పెంపుడు జంతువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. పెంపుడు జంతువుల పట్ల వాటి యజమాను లు తీసుకుంటున్న జాగ్రత్తలు ఆశ్చర్యానికి గురిచేశాయి. ఇంట్లో కుటుంబ సభ్యుల కంటే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: తమ్ముడు
సూర్యమినీ	: 3బీహెచ్‌కే
సూర్యప్యాలస్	: జురాసిక్ వరల్డ్
స్వామి	: కుబేర
శివజ్యోతి	: తమ్ముడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: జురాసిక్ వరల్డ్
రాజా	: తమ్ముడు
ఊర్వశి	: జురాసిక్ వరల్డ్
రంభ	: మార్గన్
మేనక	: షో టైమ్
అప్సర	: తమ్ముడు
కుమారి	: ----
అశోక	: కన్నప్ప
పీఎస్ మహల్(నామవరం)	: తమ్ముడు
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: తమ్ముడు
వెంకటసూర్య(కడియం)	: తమ్ముడు
సత్యగౌరి (అనపర్తి)	: తమ్ముడు
సూర్యశ్రీ (అనపర్తి)	: కన్నప్ప
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: తమ్ముడు
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తమ్ముడు
శ్రీనివాస (గోకవరం)	: తమ్ముడు
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: జురాసిక్ వరల్డ్
లలితామహల్(రంపచోడవరం)	: తమ్ముడు
నవయుగ(చింతూరు)	: తమ్ముడు





కోట సత్తెమ్మకు ఆషాఢం సారె



నిడదవోలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైకలూరు మండలం కలిదిండికి చెందిన సుమారు 100 మంది భక్తులు అమ్మవారికి ఆషాఢ మాసం సారె, చీరలు సమర్పించారు. రాజవరం గ్రామానికి చెందిన గూడవల్లి మహాలక్ష్మి రూ.50 వేలు విరాళంగా అందజేశారు.ఆషాఢమాసం..ఆదివారం.. తొలి ఏకాదశి పర్వదినం కావడంతో భక్తజనం పోటెత్తారు. అమ్మను చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి కిటకిటలాడింది. అమ్మవారికి ఆదివారం మొత్తం రూ.2,14,011లు ఆదా యం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.ఈ మేరకు ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తొలి ఏకాదశి పూజలు

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహిం చారు.. వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి.. స్వామిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. గోవిందా..గోవింద అంటూ స్వామిని కొలుస్తూ భక్తపారవశ్యంలో మునిగిపోయారు. ఆషాఢమాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అని పిలుస్తారని.. ఆదివారం నుంచి నాలుగు నెలల పాటు విష్ణుమూర్తి పాల కడలి మీద నిద్రిస్తాడని అందుకే దీనిని శయన ఏకాదశి అని కూడా పిలుస్తారని భక్తులకు తెలిపారు.. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని వెంకటేశ్వరుడికి అర్చకులు పూజలు చేశారు.



ధాన్యం

సొమ్ములివ్వండి!

రబీ సొమ్ములకు ఎదురుచూపులు

గోకవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం సొమ్ములకు రైతులు ఇంకనూ ఎదురు చూస్తున్నారు. సొమ్ముల చెల్లింపులో జాప్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు ఖాతాలో జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం నెలలు గడుస్తున్నా స్పందించడం లేదని వాపోతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ధాన్యం కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు చాలా మంది రైతులకు పూర్తిగా సొమ్ము జమ చేయలేదు. గోకవరం మండలంలో రబీకి సంబంధించి సుమారు 2 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. రైతుల నుంచి సుమారు 11,536 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత జూన్ నెల నాటికి 130 మంది రైతులకు పైగా డబ్బులివ్వాల్సి ఉండగా కొంతమందికి మాత్రమే సొమ్ములు చెల్లింపులు జరిగాయి. ఇంకా సగానికి పైగా రైతులకు ధాన్యం సొమ్ములు జమ కావాల్సి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు నారుమళ్ళు సిద్ధం చేసుకుంటున్నారు.కొద్ది రోజుల్లో ఊడ్పులకు సిద్ధమవుతారు.ఈ నేపథ్యంలో రైతులకు పెట్టుబడులకు డబ్బులు కావాలి. ముందు రబీ పంటకు చేసిన రుణాలు తీరక కొత్త అప్పులు ఇచ్చేందుకు వడ్డీ వ్యాపారులు ముందుకు రాక అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు.రబీలో అమ్మిన ధాన్యానికి చెందిన డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తే ఆ డబ్బుతో చేసిన రుణాలు తీర్చడంతో పాటు, ఖరీఫ్ సాగుచేస్తామని రైతులు పేర్కొంటున్నారు. తాము అమ్మిన ధాన్యానికి డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారంటూ మండల వ్యవసాయ కేంద్రానికి వెళుతుంటే అక్కడ అధికారులు జాడ కనిపించడం లేదంటూ బాధిత రైతాంగం వాపోతుంది.కనీసం ఫోన్‌కు స్పందించడం లేదని ఆవేదన చెందుతున్నారు.



ఆఫర్ల వల.. డిస్కౌంట్ల మాయ

- రండి బాబూ రండి.. మోసపోండి
- ఆకర్షణీయమైన ప్రకటనలతో బురిడీ
- నాసిరకం.. ప్రముఖ బ్రాండ్లకీ నకిలీ
- జనం ఆశతో కోట్లలో వ్యాపారం

ఆషాఢంలో ఆకర్షణీయమైన ప్రకటనలతో జనాలను బురిడీ కొట్టించే మోళీ మొదలైపోతోంది. నిల్వ సరుకును అంటకట్టడం, నాసిరకంపై రెట్టింపు సొమ్ము లాగేయడానికి దుకాణాలకు ఓ మంచి అవకాశం చిక్కుతోంది. ఓ రూపాయి మిగులుతుందనే అమాయక జనం ఆశను ఆసరాగా చేసుకుని దగా చేయడం పరిపాటిగా మారిపోయింది. ఏకంగా 80 శాతం వరకూ రాయితీ ఇచ్చేస్తున్నారు. గతంలో ఈ మోసంలో కూడా కాస్త నిజాయితీ ఉండేది. రాను రాను మోసం పెరిగిపోయింది.దీంతో ఆ వస్త్రాలు మరో ఆషాఢాన్ని చూడలేకపోతున్నాయి. అయినా 'ఆషాఢం డిస్కౌంట్' మాట చెవిన పడగానే.. జనం ఎగబడడంలో మాత్రం డిస్కౌంట్ ఉండడం లేదు.ఆషాఢం మార్కెట్ మాయపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ఆషాఢం అంటే వస్త్ర దుకాణాలకు అసలు వ్యాపారం ఉండేది కాదు.. అటువంటిది ఒక్క ఐడియా వ్యాపారాన్నే మార్చేసింది.. జనాలను షాపుల చుట్టూ తిరిగేలా చేస్తుంది.. అదే డిస్కౌంట్..10 నుంచి 90 శాతం వరకూ డిస్కౌంట్ ఇచ్చేస్తున్నారు. జనం అలాగే ఎగబడి కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 వేలు పైనే వస్త్ర దుకాణాలు ఉంటాయి. వీటిలో అత్యధికంగా ఒక్క రాజమహేంద్రవరంలోనే ఉంటాయి.ఈ ఒక్క ఆషాఢంలోనే కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుందని యజమానులే చెబుతున్నారు.ఎందుకంటే ఆషాఢం తరువాత వచ్చేది శ్రావణమాసం కావడంతో ఇప్పటి నుంచే సన్నద్ధమైపోతారు. డిస్కౌంట్ చీరలు కొంటారు.

నాడు వ్యాపారం నిల్.. నేడు ఫుల్..

ఆషాఢమాసం వచ్చిందంటే 'ఆషాఢం డిస్కౌంట్ సేల్' అనే బోర్డులు దాదాపు అన్ని దుకాణాల వద్ద చూస్తుంటాం. ఆషాఢం డిస్కౌంట్లకు ఎదురు చూసేవాళ్లూ లేకపోలేదు. వస్త్రాలు, చెప్పుల షాపుల వద్ద ఎక్కువగా రాయితీలు కనబడుతుంటాయి. వ్యాపారం ముసు గులో ఒకరికి మించి మరొకరు రాయితీలను ప్రకటిస్తుంటారు. ఆషాఢంలో సాధారణంగా పెద్దగా వ్యాపారాలు సాగవు. దీంతో బేరాలు పెరగడానికి డిస్కౌంట్లు పెడుతుంటారు. కొన్నేళ్ల కిందట డిస్కౌంట్లు కాస్త సహేతుకంగా సాగేవి. వ్యాపారులు ఆషాఢంలో పాత స్టాకును క్లియర్ చేసుకునేవారు. రాను రాను ఆషాఢం సేల్స్ అంటే మోసానికి నిలువెత్తు నిదర్శనంగా మారిపోయింది. అసలు ధరలను ఇష్టానుసారం వేస్తూ తగ్గింపును భారీ గా చూపించి ప్లాట్‌ఫాం సరుకును పెద్ద దుకా ణాల్లో సైతం అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి.

రాయితీలో కిటుకు

ఆషాఢంలో క్లియరెన్స్ సేల్ కాస్తా డిస్కౌంట్ ధమాకాగా మారిపోయింది. ఎవరైనా రూ.100కి కొని రూ.40కి విక్రయిస్తారా? కచ్చితంగా జరగదు. మరి ఈ డిస్కౌంట్ల మేళా ఏమిటి? అంటే అదో పెద్ద మోళీ. వినియోగదారులను దుకాణంలోకి రప్పించడమే లక్ష్యంగా డిస్కౌంటు బోర్డులు తగిలిస్తారు.లోపలకు వెళ్లాక డిస్కౌంటు ధరల వస్త్రాలు చూస్తే నీరసమొస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వస్త్రాలను చూస్తారు. వాటికి ఒక్క రూపాయి డిస్కౌంటు ఇవ్వరు. డిస్కౌంటు కోసం వెళ్లిన వాళ్లు ఏ డిస్కౌంటూ లేని దుస్తులను కొనక తప్పదు. ఇదే అదనుగా వీటి ధరలను విపరీతంగా బాదేస్తుంటారు.

అసలు ధర ఎంతబ్బా?

వస్త్రాలు, చెప్పులు, బూట్లు వంటి వాటి అసలు ధరలు చెప్పడం ఎవరి తరమూ కాదు. వ్యాపారులు ఎంతకు హోల్‌సేల్‌గా కొంటున్నారో.. వాటికి రవాణా తదితర ఖర్చులతో కలిపి ధర ఎంత నిర్ణయించాలో అనే సహేతుకత లేదు. దీనిపై ఎవరి నియంత్రణా లేదు. ధరల నిర్ణయం, తనిఖీల్లో ప్రభుత్వ యంత్రాంగం పాత్రా అంతంత మాత్రమే. దీంతో ధరలను ఇష్టానుసారం వేస్తుంటారు. ఉదాహరణకు ఒక చీర ధర రూ.5 వేలు చూపించి 60 శాతం డిస్కౌంట్ అంటూ రూ.3 వేలు మినహాయిస్తారు. రూ.2 వేలకే రూ.5 వేల విలువ చేసే చీర అంటే జనం ఎగబడతారు. వాస్తవానికి ఎంఆర్పీ అంటే గరిష్ఠ చిల్లర ధర. వ్యాపారులు దీనిని చూపించి తగ్గించడం కుదరదంటూ బురిడీ కొట్టిస్తారు. ఎంఆర్పీపై కూడా తగ్గింపు ఇస్తున్నామంటూ దయ చూపించేస్తారు. వాస్తవానికి ఆ స్టిక్కర్లన్నీ వాళ్ల అంటించినవే కదా!. పైగా ఎంఆర్పీపై బేరమాడే వెసులుబాటు కచ్చితంగా వినియోగదారుడికి ఉందనే విషయం ఎంత మందికి తెలుసు?.

నకిలీ..మకిలీ!

ఆషాఢం సేల్స్‌లో భాగంగా బ్రాండ్ల పేరుతో బురిడీ కొట్టిస్తు న్నారు. ప్రముఖ కంపెనీ వస్త్రాలు, బ్యాగులు, బూట్లు, చెప్పు లు, హ్యాండ్ బ్యాగులు, డోర్ మ్యాట్‌లు అంటూ జనాలను మోసగి స్తున్నారు. ప్రముఖ బ్రాండ్లకు పోలిన నకిలీలను రాశులుగా పోస్తున్నారు. వాటిపై విపరీతమైన రేట్లు వేస్తున్నారు. ఓ ప్రముఖ కంపెనీ యాంబ్లమ్(చిహ్నం)తో ఉండే టాప్‌లు, హ్యాండ్‌బ్యాగ్, షూ వంటి వాటిపై వేలల్లో ఎంఆర్పీ పెడుతు న్నారు. ఏకంగా 70 శాతం డిస్కౌంట్ ధరకే ఇస్తున్నామని మోసగిస్తున్నారు. ఉదాహ రణకు ఒక బ్రాండెడ్ షూ ధర రూ.10 వేలు ఎంఆర్పీ చూపించి 70శాతం డిస్కౌంట్ అంటున్నారు. అంటే రూ.3 వేలకే బ్రాండెడ్ షూ వస్తుందని వినియోగదారుడు ఆశ పడుతున్నా డు. కానీ అది నకిలీ అని తెలుసుకోలేక పోతున్నారు. వాస్తవానికి ఆ షూ ధర రూ.500 కూడా ఉండకపోవచ్చు. అతి చిన్న తేడాలతో అసలైన బ్రాండుకు అతి దగ్గరగా యాంబ్లమ్‌లను ప్రింట్ చేస్తుండడంతో వినియోగ దారులు మోసపోతున్నారు.

ఆధ్యాత్మికతకు.. 'నెల'వై!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

హిందూ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచేది ఆషాఢం..తెలుగు సంవత్సరంలో నాలుగో నెల. శూన్యమాసమైనా.. శుభకార్యాలు తలపెట్టకపోయినా.. పూజా కార్యక్రమాలకు, దేవతారాధనకు ఇది అనువైన సమయం. అందుకే ఈ మాసంలో అమ్మవార్ల జాతరలు జరుగుతాయి. కొత్త అల్లుళ్లకు ఆషాఢ పట్టీ వినోదాలు, మార్కెట్లలో ఆఫర్లు, తక్కువ ధరలతో వస్త్రాలు, వస్తువుల డిస్కౌంట్ సేల్.. ఇలా చెప్పుకొంటూ పోతే.. ఎన్నో విశేషాలు, వింతలకు ఈ మాసం నిలయం.ఈ మాసంలో పుడమి పులకించడంతో ఎక్కడ చూసినా ఆహ్లాదకరమైన హరిత వాతావరణమే కనిపిస్తుంది. దుమ్ము ధూళితో దర్శనమిచ్చే తరువులన్నీ తలంటు పోసుకున్నట్టుగా నిగనిగలాడుతుంటాయి. వ్యవసాయ పనుల ప్రారంభానికి అనువైన మాసం కావడంతో ఇంట్లో వారందరూ కష్టపడి పనిచేసేందుకు ముందుకు వెళ్లాల్సిన సమయం. ఆషాఢంలో వివాహాలు, గృహ ప్రవేశాలు చేయరు. ఇంటి నిర్మాణాలు చేపడితే ఆ ఇంటికి ధనధాన్యాలు, పశుసంపద, రత్నమాణిక్యాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసాన్ని శుచి మాసం అని కూడా అంటారు. ఇంట్లోని కంచు, ఇత్తడి వంటి వస్తువులను శుభ్రపరచుకోవడం, బంగారం, వెండి వస్తువులను మెరుగుపెట్టించుకోవడం చేస్తుంటారు. ఈ నెల రోజులు గ్రామ దేవతల పేరుతో వెలసిన అమ్మవారికి పూజలు చేసి భక్తిభావంతో కొలుస్తారు. వారాహి గుప్త నవరాత్రులు ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. ఆషాఢ శుద్ధ తొలిఏకాదశి, ఆషాఢ పూర్ణిమ, ఆషాఢ బహుళ సప్తమి, ఆషాఢ బహుళ ఏకాదశి పర్వదినాలు ప్రత్యేకమైనవి. ఈ సమయంలోనే కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మరిడమ్మ, తలుపులమ్మ లోవ, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయాల్లో భక్తుల సందడి ఉంటుంది. ఆషాఢంలో మునగాకును తప్పనిసరిగా తింటారు. మునగాకు కలిపిన కూరలు తినడంవల్ల ఒంటికి వేడి చేసి వర్షాకాలంలో ఒంటిని సమశీతోష్ణ స్థితిలో ఉంచుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

సాయి ఆలయానికి రూ. కోటి విలువైన ఇల్లు

వీలునామా రాసి మరణించిన న్యాయవాది విజయశ్రీ

కొవ్వూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆ దంపతులు సాయిబాబా భక్తులు.. అందుకే వారింటికి కూడా సాయి కుటీరం అనే పేరు పెట్టుకున్నారు..చివరికి ఆ ఇల్లు సాయి బాబా ఆలయానికే చెందాలని తలంచారు. అలాగే వీలునామా రాశారు. ఆ దంపతుల బంధువులు ఆదివారం ఆ వీలునామా సాయిబాబా ఆల యానికి ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన న్యాయవాదులు పడాల భానుప్రసాద్, గంధం విజయశ్రీ దంపతులు. విజయశ్రీ కొవ్వూరు బార్ అసోసియేషన్‌లో ప్రథమ మహిళా న్యాయవాదిగా 1974లో నమోదయ్యారు. అనంతరం ఏపీపీగా బాధ్యతలు నిర్వహించారు. భానుప్రసాద్ ఏడేళ్ల కిందట మరణించగా.. 2025 జూన్ 22వ తేదీన విజయశ్రీ మరణించారు.ఆమె చనిపోవడానికి ముందే 256 గజాల్లో కట్టుకున్న సుమారు రూ.కోటి విలువ చేసే తమ ఇంటిని కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని సాయి బాబా ఆలయానికి వీలునామా రాసి న్యాయవాది దొండపాటి కృష్ణారావుకు అందజేశారు.



వీలునామాను సాయి ఆలయ ట్రస్టీలకు అందజేస్తున్న విజయశ్రీ కుటుంబీకులు

ఇంటికి సంబంధించిన పత్రాలను ఆదివారం న్యాయవాది కృష్ణారావు,విజయశ్రీ కుటుంబీకులు, భక్తులు, పెద్దల సమక్షంలో షిరిడి సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం ట్రస్ట్ సభ్యుడు గుడివాక శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు వగ్రే నాగమురళీకృష్ణ, న్యాయవాదులు నరుకుల హనుమంతరావు, బాలదారి రమేష్, వీరంశెట్టి రాజా వరప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్, ట్రస్టు సభ్యులు కసిరెడ్డి సీతారామయ్య, సిహెచ్.సుబ్బారావు,బి.సురేష్, ఎ.రాంబాబు,సిహెచ్.గణేష్ పాల్గొన్నారు.

పేపరుమిల్లు కార్మికుల సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వేతన ఒప్పందం విషయంలో మిల్లు యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. పేపరుమిల్లులో కార్మికులు పనులు నిలుపుదల చేసి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఇందులో 11 కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయి. కలెక్టర్ సమక్షంలో వేతన ఒప్పందం అమలు చేస్తామని అంగీకరించిన యాజమాన్యం దానిని అమలుచేయకపోవడాన్ని నిరశిస్తూ సమ్మె చేపట్టాయి. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో మిల్లులో కార్యకలాపాలు స్తంభించాయి. పేపరుమిల్లు కార్మికుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ పేపరుమిల్లులో 2020 జూలై 1 నుంచి 2023 వరకు వేతన ఒప్పందాన్ని యాజమాన్యం అమలు చేయలేదన్నారు. 12/3 అగ్రిమెంట్ ప్రకారం కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 58 నుంచి 60 ఏళ్ళకు పెంచాలని చేసిన అగ్రిమెంట్‌ను అమలు చేయకుండా 58 ఏళ్ళకే రిటైర్డ్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



బడికి.. వెళదాం!

- రండి..రండి దయ చేయండి
- 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్
- కూటమి ప్రభుత్వంలో రెండోసారి

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం)

పాఠశాలలు, కళాశాలలు ముస్తాబవుతున్నాయి.. పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు సన్నద్ధమవుతున్నాయి.కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమావేశాలు నిర్వహించడం రెండోసారి. ఆ రోజున అమ్మ పేరుతో మొక్కలు నాటడం, ఫొటో బూత్ వద్ద తల్లిదండ్రులతో ఫొటోలు దిగడం, ఆటలపోటీలు, సహపంక్తి భోజనాలు ఇలా పండుగ వాతావరణంలో సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిసారి గతేడాది డిసెంబరు నెలలో నిర్వహించిన మెగా పీటీఎం విజయవంతం కావడంతో ఈసారి మెగా పీటీఎం-2.0 నిర్వహిస్తున్నారు.

అందరి భాగస్వామ్యంతో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పాఠశాలలు, కళాశాలల పనితీరు, విద్యాబోధనలో పలు మార్పులు తెచ్చారు. వీటిని తల్లిదండ్రులకు వివరించడం, పాఠశాలల అభివృద్ధిలో వారితో పాటు పూర్వ విద్యార్థులు, విద్యారంగ ప్రముఖులు, దాతలను భాగస్వాములు చేయడం లక్ష్యంగా దేశంలోని విద్యారంగ చరిత్రలో తొలిసారి గతేడాది డిసెంబరు 7న నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సత్ఫలితాలను ఇచ్చింది. రెండో విడత ఈనెల 10న ఈ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-2.0(మెగా పీటీఎం) నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంపై ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్లు అన్ని జిల్లాల అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు ఇచ్చారు.సమావేశం ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై రాష్ట్రస్థాయి నుంచే మినిట్ టూ మినిట్ ప్రోగ్రామ్‌ను పంపించారు.

ఫొటో సెషన్, ఆటల పోటీలు

10న ఉదయం 9గంటలకు సమావేశాలు ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిస్తారు. ఉదయం తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులను పాఠశాలకు ఆహ్వానిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసే ఓపెన్‌హౌస్ ఫొటోబూత్ వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఫొటో దిగే ఏర్పాటు చేయనున్నారు. అనంతరం తమ పిల్లలతో కలిసి వారి క్లాస్‌రూమ్‌లో తల్లిదండ్రులు కూర్చునేలా, ఇతర ప్రముఖులు హెచ్‌ఎం రూమ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో సంబంధిత క్లాస్ టీచర్ ప్రత్యేకంగా సమావేశమై వారి పిల్లల సమగ్ర పురోగతి కార్డులు(ప్రోగ్రస్ కార్డు), హెల్త్ కార్డును అందిస్తారు. అదే సమయంలో వీడియోల ద్వారా తల్లికి వందనం పథకం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్, మన బడి మేగజైన్ తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల తల్లులకు రంగోళి లేదా లెమన్ అండ్ స్పూన్ లేదా మ్యూజికల్ చైర్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. 11గంటలకు సమావేశాలు ప్రారంభించి మా తెలుగు తల్లికి పాట అనంతరం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్దేశించారు.ఇందులో భాగంగా విద్యార్థులతో వారి తల్లులకు పుష్పాలు సమర్పించి పాదాలకు నమస్కరించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా తల్లి పేరుతో మొక్క నాటడం, గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. నో టూ డ్రగ్స్, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యులవుతామంటూ సామూహిక ప్రతిజ్ఞ ఉం టుంది. చివరగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, ఆహ్వానితులు కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని చేస్తారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కామన్ లంచ్ ఏర్పాటు చేయాలి.

1677 పాఠశాలల్లో పేరెంట్స్ మీట్

ఈ నెల 10న జిల్లాలో 1537 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 120 కళాశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నాం. విద్యా నాణ్యతను మెరుగుపర్చేందుకు సమగ్ర శిక్షా మిషన్ కింద ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రతి పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులు అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా సేకరించేందుకు సమగ్ర ప్రశ్నావళి, రూపొందించి దాని కనుగుణంగా అభిప్రాయ సేకరణ చేయడం ప్రధాన లక్ష్యం. పేరెంట్స్ మీటింగ్‌కు పాఠశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రశాంతి, కలెక్టర్, తూర్పుగోదావరి

జంతువుల నుంచి రేబిస్

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు


రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రేబిస్ అనేది జంతువుల నుంచి ప్రధానంగా కుక్కల నుంచి వ్యాపించే ప్రాణాంతక వ్యాధి అని, ముందస్తు వ్యాక్సిన్ ద్వారా దీన్ని పూర్తిగా నివారించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం జంతువుల కాట్లపై అవగాహన-రేబిస్ వ్యాధి నివారణకు ముందస్తు వ్యాక్సినేషన్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడారు. జంతువుల కాట్లను తేలిగ్గా తీసుకోవద్దని, రేబిస్ వ్యాధిని అరికట్టేందుకు ముందస్తు వ్యాక్సినేషన్ తీసుకోవడం అతిముఖ్యమైన రక్షణ చర్య అని అన్నారు. జూలై 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ రేబిస్ వ్యాధి నివారణ కోసం ముందస్తు వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీ స్థాయిల్లో ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. జిల్లా ఎపిడెమియాలజిస్ట్ సుధీర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ జగదీష్, ఎంపీహెచ్‌ఈవో బుర్రే రాజు, వైఎస్ఎన్ మూర్తి, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓ మై డాగ్!



ఇంటి కుక్కలు బయటకొచ్చాయి.. కాసేపు కనుల విందు చేశా యి.. వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరం పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేశారు.. పలువురు జంతువులతో క్యూకట్టారు.

గోదావరి వరద తగ్గుముఖం



నిన్నటి వరకూ పెరిగిన గోదావరి వరద శాంతించింది.. ఆదివారం తగ్గుముఖం పట్టింది.

8

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



మెరకవీధిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

● వాడవాడలా వర్ధంతి వేడుకలు ● పెద్దసంఖ్యలో హాజరైన ప్రజాప్రతినిధులు

కొవ్వూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దళితులకు అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ రెండు కళ్లు లాంటివారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మెరకవీధిలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీగా జీవితాన్ని ప్రారంభించి, కేంద్రమంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. పెనుమాక జయరాజు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, పెద్దాడ ఏసుబుజ్జి, మద్దిపాటి సత్యనారాయణ, వేమగిరి వెంకట్రావు పాల్గొన్నారు.

నిడదవోలు: బాబూ జగ్జీవన్‌రామ్ బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని మాజీ సర్పంచ్ ఎండీ అక్రమ్ అన్నారు. ఆదివారం సమిశ్రగూడెంలో బాబూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉప్పులూరి రామ్మోహనరావు, గజ్జరపు రమేష్, గోగిన శ్రీనివాస్, ముప్పిడి రాజారత్నం, కొల్లి శ్రీను, ముప్పిడి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిమెట్టలో ఆయన విగ్రహానికి జగ్జీవన్‌రామ్ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొప్పాక పోసియ్య మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దళితుల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.దుర్గారావు, జీ.రాజు, బీ.భాస్కరరావు, పీ.పుష్పరాజు, జి.గణేష్, జి.గాంధీ, ప్రమోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మలకపల్లిలో జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ మాట్లాడుతూ చిన్నతనంలోనే రాజకీయ అరంగ్రేటం చేసి కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో జి.రాజు, కె.రమేష్, ఎస్.బన్నీ, ధ్రువ, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్వర్గీయ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత మోదుగ సుబ్బారావు అన్నారు. ఆదివారం చీపురుగూడెంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెనుమాక వెంకటేశ్వరరావు, పండు, చిన్నియ్య, సర్రాయ్య, జాలాది దుర్గారావు, వసంతాడ శ్రీను పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: దళితుల సంక్షేమానికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చెట్టే సుజనరావు పేర్కొన్నారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా కాల్ధరిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి, దళితులకు సేవలందించారని కొనియాడారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, ఉపసర్పంచ్ ఈర్పిన సత్యనారాయణ, గ్రామటీడీపీ అధ్యక్షుడు కోమట్లపల్లి విశ్వనాథం, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, నాయకులు చెట్టే సర్వేశ్వరరావు, కోమట్లపల్ల భీమన్న, కరుటూరి కృష్ణారావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వేలివెన్ను, ఉండ్రాజవరం, మోర్త, చివటం, తదితర గ్రామాల్లోనూ వర్ధంతి వేడుకలను నిర్వహించారు.

గోపాలపురం: మండలంలోని ఆయా గ్రామాల్లో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాదాలకుంటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సేవా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు: సమిశ్రగూడెంలో ...



తాళ్లపూడి : పైడిమెట్టలో



నల్లజర్ల : చీపురుగూడెంలో ..



ఉండ్రాజవరం: కాల్ధరిలో ...

చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి



ఉండ్రాజవరంలో చెరువుకు నీటిని విడుదల చేస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉండ్రాజవరంలోని రజక చెరువు పూడిక తీత పనులు పూర్తి అయ్యాయి. దీనికి మండల పరిషత్ నిధులు రూ. మూడు లక్షలు, మాజీ సర్పంచ్, టీడీపీ నేత గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం సొంతనిధులు జోడించారు. ఈ మేరకు ఆదివారం మంత్రి చెరువులోకి నీటిని విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, పెరవలి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, నాయకులు కుదప చక్రపాణి, రజకసంఘ నాయకులు పాల్గొన్నారు.

అనిల్ కుటుంబానికి ఎంపీ పురందేశ్వరి పరామర్శ



వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఇతర నేతలు

దేవరపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ తండ్రి ఆండ్రూ వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందటంతో ఆదివారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ వెంకటేశ్వర రావు మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. ఈమెతో పాటు రాజమహేంద్రవరం రుడా ఛైర్మన్ బొట్టు అనంత వెంకట రమణ చౌదరి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెరవలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లయన్స్ క్లబ్ సేవలు చూస్తూ పెరిగానని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం జరిగిన పెరవలి మండల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, వంక రాజ కుమారి నూతన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం పెరవలి మండలం లయన్స్ క్లబ్‌ను ప్రారంభించిన శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ చేతుల మీదుగా నూతన కార్యవర్గ సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పీడీజీ గట్టిం మాణిక్యాలరావు, గాట్ సర్వీస్ ఛైర్‌పర్సన్స్ లైన్ పుట్టా విజయ, అల్లూరి గౌరీరావు, మాదిరెడ్డి కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు తొలి ఏకాదశి పూజలు



శాకాంబరీ మాత అలంకరణలో అమ్మవారు

ఉండ్రాజవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో కనకదుర్గ అమ్మవారిని ఆదివారం తొలిఏకాదశి సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ మాతగా అలంకరించారు. దీనిలో భాగంగా ఆలయం చుట్టూ కూరగాయలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే కె. సావరంలో ముత్యాలమ్మ ఆలయ వద్ద, ఉండ్రాజవరంలో ముత్యాలమ్మ వారి ఆలయంలోనూ పూజలు చేశారు..

ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ



గోపవరంలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

నిడదవోలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీని స్థాపించారని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఆదివారం గోపవరంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.విగ్రహ దాత కరుటూరి వీరమణికంఠ, సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, తిరుపతి సత్యనారాయణ, వెలగన సూర్యారావు, ఆరేపల్లి చిననంగాలు, పంచదార దుర్గాప్రసాద్, బైపే రాజేశ్వరరావులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'సుపరిపాలనలో తొలిఅడుగు'

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



13వ వార్డులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతోనే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 13వ వార్డు దగ్గువారి రామాలయం వద్ద నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలు హరతులు పట్టి స్వాగతం పలికారు. స్థానికంగా వాటర్ పైపులైను, డ్రైనేజీ, వీధిదీపాల నిర్వహణ, తల్లికి వందనం అమలు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ పనితీరును తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రతి శుక్రవారం కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, మద్దుల సత్యనారాయణ, రాజాన శ్రీనివాస్, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, నాగళ్ల విజయలక్ష్మి, బొజ్జంకి అభిరామ్, బత్తి అబ్బులు, పి. మురార్జీ, చక్రపాణి, ఎ.నగేష్, ఆర్. హరిబాబు, కౌన్సిలర్లు బత్తి నాగరాజు, బొండాడ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

కరిచర్లగూడెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గోపాలపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని మండల బీసీ సెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. కరిచర్లగూడెంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పిలుపుతో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏడాది పాలనలో ఏయే పథకాలు అందాయి, ఇంకా అందాల్సిన పథకాలు ఏమున్నాయో నమోదు చేసుకున్నారు. అనంతరం పలువురు నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పటాన్‌ముగ్బుల్ భాష, బూత్ ఇన్‌ఛార్జ్ పటాన్ రహీం. మాజీ గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూడి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు అనిశెట్టి సత్తిబాబు, వేముల మంగరాజు, నెరుసు సురేశ్, చల్లమల్లరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేయించాలి : ఎమ్మెల్యే

కొవ్వూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలు పెంచే యజమానులు తప్పనిసరిగా వాటికి వ్యాక్సిన్లు వేయించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వూరు ప్రభుత్వ పశు వైద్యశాలలో ఆదివారం పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా వేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 86 కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, పాలింపాటి చినబాబు, పరిమి హరిచరణ్, పెనుమాక జయరాజు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఏ.వెంకటరెడ్డి, డా.చంద్రమౌళి, ఎస్.జ్యోతి, లయన్స్‌క్లబ్ సభ్యులు మద్దిపాటి సత్యనారాయణ, పాలడుగుల లక్ష్మణరావు, యనమదల సుబ్రహ్మణ్యం, హరాన్సెస్, కలగర వెంకట్రావు, మన్యం బుల్లిబాబు, మున్సిపల్ కమిషనర్ సందీప్ పాల్గొన్నారు.

గోష్పదేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వర స్వామి ఆలయంలో తొలిఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం, తొలి ఏకాదశిని పురస్కరించుకుని లలితాపార్వతీ అమ్మవారిని కూరగాయలతో శాఖాంబరిమాతగా అలంకరించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో గణపతి పూజ, లఘున్యాసం, శివునికి ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష బిల్వార్చన చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

వెంకన్న ఆలయంలో పూజలు

దేవరపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలిఏకాదశి సందర్భంగా భక్తులు స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం నుంచి శ్రీవారి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, సాయంత్రం శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

నిడదవోలు,జూలై6(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం ఔరంగబాద్ ఇసుక ర్యాంపు నుంచి ఏపీ37టీఈ4969 నెంబరు గల లారీలో 10 టన్నుల ఇసుకను అనధికారికంగా తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ ఏఎస్ఐ జీఆర్‌కే గంగాధరరావు డీ. ముప్పవరం వద్ద ఆదివారం పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం లారీని సమిశ్రగూడెం పోలీసులకు అప్పగించారు.

అట్టహాసంగా ఏఎంసీ ఛైర్మన్ బ్రహ్మారాజు ప్రమాణ స్వీకారం

● ముఖ్యఅతిథులుగా ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి, తదితర నేతలు హాజరు





బ్రహ్మారాజుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, గజమాలతో స్వాగతం పలుకున్న టీడీపీ శ్రేణులు

నల్లజర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశంలోని రైతుకు రక్షణ కల్పించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు.ఆదివారం నల్లజర్ల స్టార్ గ్రాండ్‌లో గోపాలపురం ఏఎంసీ ఛైర్మన్‌గా ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన యద్దనపూడి బ్రహ్మారాజు ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రైతు సేద బిందువును కార్చి ధాన్యం పండించి దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాడని పేర్కొన్నారు. అలాగే గోపాలపురం ఏఎంసీని మరింతగా అభి వృద్ధి చేసి రైతులను ఆదుకోవాలని నూతనం గా ప్రమాణ స్వీకారం చేసిన బ్రహ్మారాజుకు సూచించారు. ముం దుగా ఎమ్మెల్యే మద్ది పాటి వెంకటరాజు ప్రకాశరావుపాలెం నాయకులు,సర్పంచ్‌లు కార్యకర్తలతో వెళ్లి నూతనంగా ఎన్నికైన గోపాలపురం ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజును ఘనంగా ఆహ్వానించారు. నల్లజర్లలో వల్లూరి సత్తిపండు,కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీనివాసరావు గజమాలతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజును, ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజును ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, అనపర్తి ఎమ్మెల్యే నల్లివిల్లి రామకృష్ణ రెడ్డి,రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి,మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగ్రాజు,పసుమర్తి రతీష్, వలవల బాజ్జీ, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, రావూరి వెంకట రమణ, విడియాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

● 2,18,257 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద ఆదివారం ఉదయానికి 10.90 అడుగుల నీటిమట్టం ఉండగా, 2.11 లక్షల క్యూసెక్కులు బ్యారేజ్‌గేట్ల ద్వారా దిగువకు వెళ్లింది. సాయంత్రానికి నీటి విడుదలను మరింత పెంచి ధవళేశ్వరం ఆర్మ్‌లో 50 గేట్లను .40మీటర్లు, 20గేట్లను .80 మీటర్లు, ర్యాలీ ఆర్మ్‌లో 43 గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 20 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 39 గేట్లను 40 మీటర్ల మేర పైకి 2,18,257 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో బ్యారేజ్ దిగువ భాగం సముద్రంలోకి ప్రవహించే నీటితో జలకళ సంతరించుకుంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.10 అడుగులుగా నమోదయ్యింది.భద్రాచలం వద్ద 20.30 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం తగ్గుతూ 18.50 అడుగులకు చేరుకుంది.

ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవాలి : ఎమ్మెల్యే



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మండల టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఆదివారం నల్లజర్ల స్టార్ గ్రాండ్‌లో నియోజకవర్గంలోని 83 గ్రామ పంచాయతీల్లో నూతనంగా నియమింపబడిన టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసే బాధ్యత మీపై ఆధారపడి ఉంద న్నారు. అనంతరం గోపాలపురం ఏఎంసీ ఛైర్మన్‌గా ప్రమా ణస్వీకారం చేసిన యద్దనపూడి బ్రహ్మారాజు స్వగ్రామం ప్రకాశ రావుపాలెంకు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలను వెంట తీసుకుని వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, నల్లజర్ల మండల టీడీపీ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, దేవరపల్లి, ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాధ్యక్షులు, సీనియర్ నాయకులు పసుమర్తి రతీష్,షేక్ మీరా సాహెబ్, కూచిపూడి ఉదయభాస్కర్, యలమాటి శ్రీనివాస్, వల్లూరి సత్తిపండు, కండెపు వెంకటరత్నం, నిమ్మల పూడి ప్రసాద్, కాకర్ల రామకృష్ణ, ఈడే శ్రీను, ఏలేటి సత్యనారాయణ (జేడీ)గన్నమనేని వెంకటేశ్వరరావు, చెల్లు పెద్ద రామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, విడియాల శ్రీను, ఘంటా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌ను కలిసిన ఉద్యోగులు



కేకు కట్ చేస్తున్న ఛైర్మన్ జవహర్

కొవ్వూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరులో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్‌ను ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దీనిలో భాగంగా ఎంఆర్‌పీఎస్ స్థాపించి 37 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో ముందుకు వెళ్తున్నానన్నారు. కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు డా.సుబ్బారావు, రాయి రాంబాబు, కొమ్ము సత్యనారాయణ, తాతపూడి వెంకటేష్, రాజమహేంద్రవరం అధ్యక్షులు కొల్లి శ్యాంసన్, రాచర్ల రాజేష్, కాకినాడ అధ్యక్షులు కాట్ల ఆశీర్వాదం, బెన్ జాంసన్, బి. అప్పారావు, పి. వేగేశ్వరరావు, పి.సత్తిబాబు, బి. రమేష్, జె. ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల లాయర్స్ ఫెడరేషన్ సభ్యులు జవహర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.ప్రసాదరావు, వి.గోపినాథ్, చిడిపి వీర్రాజు, కె.దయానంద్‌రాజ్, జి.చిట్టిరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన అండర్ -13 జిల్లా స్థాయి చెస్ పోటీల్లో మంచి ప్రతిభ చూపించిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో శ్రీనికేష్ జమ్ములమడక ప్రథమ బహుమతి, బాలికల విభాగంలో సత్యతేజశ్రీ సుంకర ద్వితీయ బహుమతి గెల్చుకుని అర్హత సాధించారని కోచ్, క్యాల్యూజన్ చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ తెలిపారు. అలాగే అకాడమీ నుంచి వివిధ విభాగాల్లో చిన్నారులు బహుమతులు గెల్చుకున్నారన్నారు.